

సవాళ్లను స్వీకరిస్తేనే..
సవాళ్లను స్వీకరించిన వారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అన్నారు. 8లో



అధికారులు సన్నద్ధమవ్వాలి
జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ మల్లికార్జున సూచించారు. 8లో



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..
నగరంలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 8లో

న్యూస్‌రీల్

సత్వరం అభివృద్ధి పనులు పూర్తి



జగదాంబ జంక్షన్ వద్ద ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌శర్మ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం పలు ప్రాజెక్టు పనులను పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు, ఇంకా పూర్తి కావల్సిన పనులపై కమిషనర్ ఆరా తీశారు. సంపత్ వినాయగర్ ఆలయం రోడ్డు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పాతజైల్‌రోడ్డు జంక్షన్, అక్కడి నుంచి జగదాంబ జంక్షన్, వైజాగ్ సెంట్రల్, పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, పాతపోస్టాఫీస్ వరకు రోడ్లు, ఫుట్‌పాత్‌లు పరిశీలించారు. అనంతరం ద్వారకానగర్ జంక్షన్ నుంచి గురుద్వార్, శంకరమఠం రోడ్డు, మాధవధార, ఎన్ఎస్‌టీఎస్ గేట్ నుంచి పీఎఫ్ కార్యాలయం వరకు రోడ్ల పనులు పరిశీలించి సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వేంకటేశ్వరరావును ఆదేశించారు. గురుద్వార్ జంక్షన్ సమీపాన రోడ్డుపై టిఫిన్ వ్యాపారం చేస్తున్న వ్యాపారిని మందలించి, షాపుల్లో మాత్రమే వ్యాపారం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ వేంకటేశ్వరరావు, డీఇఇ శ్రీనివాసరాజు, ఏఇలు ఈశ్వర్‌గుప్తా, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత సోమవారం కొనసాగింది. ఈనెల 5న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనం (120 కిలోలు) సమకూర్చేందుకు ఆదివారం నుంచి అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు 43 కిలోలు చందనాన్ని అరగదీయగా, రెండో రోజు సోమవారం మరో 43 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో 34 కిలోల చందనం కావాల్సి ఉండగా మంగళవారం కూడా అరగదీత కొనసాగనుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 15 మంది నాల్గవ తరగతి సిబ్బంది చందనాన్ని అరగదీశారు.

నేడు ఉద్యోగ విజయోత్సవం

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ విజయోత్సవాలు మంగళవారం నిర్వహించేందుకు ఆయా పాలిటెక్నిక్ కాలేజీల యాజమాన్యాలు ఏర్పాట్లు చేశాయి. ఈ విద్యాసంవత్సరంలో కాలేజీల్లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలు పొందిన వారికి ఈ ఉత్సవాల్లో నియామక పత్రాలు అందిస్తారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)ల్లో మంగళవారం ఉత్సవాలు నిర్వహిస్తారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించే ఉత్సవాల్లో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించే ఉత్సవాల్లో మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

10లోగా ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ వివరాలు అందజేయాలి

మహారాణిపేట: జిల్లాలో నడుస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు ఈనెల 10వ తేదీలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. నమోదు చేసుకోని ఆస్పత్రులపై క్లినికల్ ఎస్టాబిష్‌మెంటు యాక్టు 2002/2007 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌ల https@//clinicalesttact.ap.gov.in/ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. స్కానింగ్ కేంద్రాలు https@//pcpndt.ap. gov.in లో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

మహారాణిపేట: ప్రతి పెన్షనర్ ఈనెల 10వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే పెన్షన్ అందుతుందని పేర్కొన్నారు. సంబంధిత ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ అందుబాటులో ఉందన్నారు.

బాబ్జీకి భరత్ గండి!

- విశాఖ దక్షిణ సీటు కోసం కసరత్తు
- మీ కోసం–మీ భరత్ పేరుతో పాదయాత్ర
- పెందుర్తి సీటుపై గండి బాబ్జీ కన్ను
- ఇదే అదనుగా బండారుపై అవినీతి ఆరోపణలు?
- పాయకరావుపేట నియోజకవర్గంలో అనితపై కాపు నేతల ఫైర్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీలో రేగుతున్న వివాదాలు

తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు క్రమంగా పెరుగుతున్నాయి. గంటా–అయ్యన్నతో మొదలైన ఈ విభేదాలు కాస్తా తాజాగా విశాఖ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాలకూ పాకాయి. విశాఖ దక్షిణ సీటుపై భరత్ కన్నేయగా.. గండి బాబ్జీ చూపు కాస్తా పెందుర్తిపై పడింది. పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు అవినీతిపరుడంటూ ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. మరోవైపు పాయకరావుపేటలో గంటా, చిరంజీవి ఫొటోలు లేకుండానే అనిత ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించడంతో ఆ పార్టీ కాపు నేతలు మండిపడుతున్నారు. అయినా అయ్యన్న అండతో అనిత తగ్గేదేలే అని అంటున్నారు. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో విభేదాల పర్వం క్రమంగా అన్ని నియోజకవర్గాలకూ పాకుతోంది.



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

తెలుగుదేశం పార్టీలో విశాఖ దక్షిణ సీటు కాస్తా హీటు పుట్టిస్తోంది. విశాఖ దక్షిణం నుంచి పోటీ చేసేందుకు భరత్ ఆసక్తి చూపుతుండటం.. పెందుర్తి నియోజకవర్గంలోనూ సెగలు రేపుతోంది. గత ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి ఓటమి పాలైన భరత్ ఇప్పుడు విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వీలుగా 'మీ కోసం– మీ భరత్' పేరుతో పాదయాత్రలు చేస్తున్నారు. ఈ పాదయాత్రలు కూడా కేవలం దక్షిణ నియోజకవర్గానికే పరిమితం కావడం చర్చనీయాంశమవుతోంది. విచిత్రంగా ఈ పాదయాత్రలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న గండి బాబ్జీ కూడా పాల్గొంటుండటం గమనార్హం. ఇది కాస్తా ఇప్పుడు పెందుర్తి నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. పెందుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు వీలుగా గండి బాబ్జీ పావులు కదుపుతున్నారన్న చర్చ నడుస్తోంది. ఇదే అదనుగా గత ఎన్నికల్లో తనకు సీటు ఇస్తే గెలిచేవాడినని.. అవినీతి వ్యవహారంలో కూరుకుపోయిన బండారు ఓడిపోతారని తాను ముందే పార్టీ పెద్దలకు చెప్పినట్టు గండి బాబ్జీ వ్యాఖ్యానించడం కొత్త చర్చకు తెరలేపింది. మరోవైపు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో గంటా శ్రీనివాసరావు, చిరంజీవి వంటి నేతల ఫొటోలు లేకుండా పాయకరావుపేట నియోజకవర్గంలో అనిత ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వ్యవహారంపై ఆ పార్టీ కాపు నేతలు మండిపడుతున్నారు. తమను చిన్నచూపు చూస్తున్న అనిత తీరు మార్చుకోకపోతే అంతిమంగా తామంతా టీడీపీకి దూరమవుతామని కూడా నియోజకవర్గ కాపు నేతలు హెచ్చరించారు. ఇక ఇప్పటికే గంటాకు అయ్యన్నకు మధ్య పచ్చగడ్డి వేయకపోయినా మండుతున్న పరిస్థితి నెలకొంది. మొత్తంగా తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య రేగుతున్న విభేదాలు క్రమంగా అన్ని నియోజకవర్గాల్లో రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.

నేత లేకపోవడంతో..

విశాఖ దక్షిణ నియోజకవర్గానికి టీడీపీకి నాయకుడు లేని పరిస్థితి ఉంది. ఎమ్మెల్యేగా ఉన్న వాసుపల్లి గణేష్‌కుమార్ కాస్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీని కాదని దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి కాస్తా దక్షిణ నియోజకవర్గంలో నాయకుడు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గండి బాబ్జీని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. అయిష్టంగానే ఈ బాధ్యతలను స్వీకరించిన గండి బాబ్జీ.. నామమాత్రంగా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు తెరపైకి భరత్ రావడంతో.. తన కన్ను కాస్తా పెందుర్తిపై పడింది. ఇదే అదనుగా బండారుతో పాటు ఆయన కుమారుడుపై కూడా అవినీతి ఆరోపణలు రావడంతోనే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మరోసారి ఆయనకు సీటు ఇచ్చినా ఓటమి తథ్యమని కూడా తన సన్నిహితుల వద్ద ఆయన వ్యాఖ్యానిస్తున్నట్టు సమాచారం.



సెల్ఫీ నీకు.. టికెట్ నాకు..

గంటా–అయ్యన్న మధ్య మరింత గ్యాప్!

గంటా శ్రీనివాసరావుకు, అయ్యన్న పాత్రుడుకు మధ్య రోజురోజుకీ గ్యాప్ మరింత పెరుగుతోంది. ఇప్పటికే తన నియోజకవర్గంలో గంటా తలదూరుస్తున్నారన్న అనిత... తాజాగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ఆయన ఫొటో లేకుండానే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కార్యక్రమాలను నిర్వహించారు. ఇక కొద్దిరోజుల క్రితం ఉత్తరాంధ్ర సమీక్ష కోసం విశాఖ వచ్చిన చంద్రబాబుకు ముందురోజే అయ్యన్న ఝలక్ ఇచ్చారు. తాను సమీక్షకు రానని భీష్మించుకూర్చున్నారు. నర్సీపట్నంతో పాటు అనకాపల్లి ఎంపీ సీటు వ్యవహారంలో గంటా తలదూర్చడంతో పాటు ఇన్ని రోజులుగా మిన్నకుండి ఇప్పుడు అంతా తానై వ్యవహరిస్తూ తమను పార్టీకి దూరం చేస్తున్నారని అయ్యన్న మండిపడ్డారు. ఈ నేపథ్యంలో చివరకు చంద్రబాబు దిగివచ్చి సమీక్ష సందర్భంగా అయ్యన్నకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు గంటాను దూరంగా ఉంచారు. ఇదే అదనుగా అనిత కూడా గంటా ఫొటో లేకుండానే తన నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిపై ఆ పార్టీ కాపు నేతలు మండిపడుతున్నప్పటికీ తగ్గేదేలే అని ముందుకు వెళుతున్నారు. మొత్తంగా టీడీపీలో ఈ అసమ్మతి వ్యవహారం క్రమంగా అన్ని నియోజకవర్గాలకు పాకుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఈ నెల 3న జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధురవాడ హిల్ నెం 4 పై అదానీ డేటాసెంటర్‌కు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఎల్ఈడీ స్క్రీన్స్, ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఈసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరవుతున్న ప్రజాప్రతినిధులకు, అధికారులకు సీటింగ్, ప్రజెంటేషన్ ఏర్పాట్లు మంగళవారం మధ్యాహ్నానికి పూర్తి చేయాలన్నారు. సీఎం పర్యటన ముగిసేంత వరకూ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన జనరేటర్లు సిద్ధం చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు 87.29 శాతం పింఛన్ల పంపిణీ



19వ వార్డులో రాములమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చింతపల్లి మౌనిక



అమర్‌నగర్‌లో వాసుపల్లి వరలక్ష్మికి వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నందిని



బోని లక్ష్మికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గౌతమి

మహారాణిపేట : జిల్లాలో 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ చురుగ్గా కొనసాగుతోంది. సోమవారం రాత్రి 9 గంటలకు 87.29 శాతం పంపిణీ పూర్తయింది. వర్షం కురుస్తున్నా వలంటీర్లు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. జిల్లాలో 1.59 లక్షల మందికి పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.44.64 కోట్లు విడుదల చేసింది. తొలిరోజు 1.35 లక్షల మందికి రూ. 38 కోట్లు అందించారు. అర్హులైన లబ్ధిదారులకు అయిదు రోజుల్లో పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు.

కిడ్నీ బాధితుడికి పది రోజుల్లో పింఛన్



వైకుంటరావుకు పింఛన్ అందజేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, సచివాలయ సిబ్బంది

ఆరిలోవ: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లోనే పింఛన్ మంజూరైంది. సోమవారం అతడు మొదటి నెల పింఛన్ అందుకున్నాడు. జీవీఎంసీ 11వ వార్డు పరిధి వివేకానందనగర్‌కు చెందిన జి.వైకుంఠరావు కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. పింఛన్ కోసం పది రోజుల క్రితం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల అయనకు పింఛను మంజూరు అయింది. మొదటి నెల పింఛన్ రూ.10 వేలు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సచివాలయం సిబ్బందితో కలసి సోమవారం అందజేశారు. వైకుంఠరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని ఇంతవరకు పోషించుకొచ్చాడు. డయాలసిస్ అవసరం కావడంతో వైద్య ఖర్చుల కోసం ఇబ్బందిపడుతున్న సమయంలో ఈ పింఛన్ ఆదుకుందని వైకుంఠరావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బాధితులకు సత్వరమే సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ అప్పలనాయుడు, ఏఎస్ఎం రాధ పాల్గొన్నారు.

కార్మికలోకానికి వెన్నుదన్నుగా సీఎం జగన్

- తమ పార్టీ పేరులో కార్మికులకు ప్రత్యేక స్థానం
- స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం
- మేడే వేడుకల్లో మంత్రి అమర్‌నాథ్ వెల్లడి



మే డే సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, ముత్తంశెట్టి తదితరులు

సాక్షి, విశాఖపట్నం : కార్మిక లోకానికి వెన్నుదన్నుగా సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పార్టీ పేరులోనే కార్మికులకు ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విభాగం జోనల్ ఇన్‌చార్జి కలిదిండి బద్రినాథ్ ఆధ్వర్యంలో సోమవారం కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్ జగన్ కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆటో కార్మికులు, మున్సిపల్ కార్మికుల కోసం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నారో అందరికీ తెలుసునని అన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలలో 75% ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి.. దానిని అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన పార్టీ తమదేనని, ముందునుంచీ ఉద్యమంలో భాగస్వాములైన విషయాన్ని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చడానికి సీఎం జగన్ అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని, ఇందులో భాగంగానే భోగాపురం ఎయిర్‌పోర్ట్, అదాని డేటా సెంటర్‌కు శంకుస్థాపనలు చేస్తున్నారని పేర్కొన్నారు.

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తగరపువలస జూట్ మిల్లు 20 ఏళ్ల పాటు మూత పడినప్పటికీ టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే జూట్ మిల్ కార్మికులకు రూ.20 కోట్ల బకాయిలు చెల్లించిందని చెప్పారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని టీడీపీ ప్రభుత్వమే మూయించిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాజీనామా చేసినట్టు గంటా శ్రీనివాసరావు చెప్పుకుంటున్నారని, అలా అయితే గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓటు వేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ హరివెంటకకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడుతూ కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పటికీ ఉంటుందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘం నాయకుడు మస్తానప్ప మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపడుతున్న పోరాటానికి వైఎస్సార్ సీపీ మద్దతునిస్తోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, రాష్ట్ర, జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, సుజాత సత్యనారాయణ, సుజాత అప్పలకొండ, కేపీ బాబా, జోనల్ ఇన్‌చార్జులు తుల్లి చంద్రశేఖర్, మారుతి ప్రసాద్, అల్లంపల్లి రాజబాబు, కంపా హనోక్, జిల్లా అనుబంధ అధ్యక్షులు కృపాజ్యోతి, బోని శివరామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, అప్పన్న, పార్టీ నాయకులు పేర్ల విజయ చంద్ర, నడింపల్లి కృష్ణంరాజు, ద్రోణంరాజు శ్రీవాత్సవ, పేడాడ రమణికుమారి, పీలా వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాస్, అల్లు శంకరరావు, బిపిన్ కుమార్ జైన్, అప్పలరత్నం, రెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ దిగువ స్థాయి నుంచి ఎదిగిన నాయకుడిలో సుబ్బారెడ్డి ఒకరని, ఆయన సుఖ సంతోషాలతో ఉండాలని, వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని ఆకాంక్షించారు.

పగలు చల్లన.. రాత్రి వెచ్చన!

- గరిష్ట ఉష్ణోగ్రత 26.2.. కనిష్టం 27.4 డిగ్రీల నమోదు
- విశాఖలో అరుదైన వాతావరణం
- వర్షానికి గాలులు, తేమ కారణమంటున్న నిపుణులు

ప్రాంతం	వర్షపాతం (సెం.మీల్లో)
పెదగంట్యాడ	6.1
ములగాడ	3.2
గాజువాక	2.9
సీతమ్మధార	2.7

సాక్షి, విశాఖపట్నం: పగటికంటే రాత్రి వెచ్చగా ఉంటుందంటే ఎవరైనా నమ్ముతారా? అలా చెబితే అదంతా అబద్ధం అని కొట్టి పడేస్తారు. కానీ విశాఖలో అలాంటి నమ్మశక్యం కాని వాతావరణమే ఏర్పడింది. అలాంటి అత్యంత అరుదైన వాతావరణ పరిస్థితి సోమవారం నెలకొంది. సాధారణంగా ఏ సీజనులోనైనా పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలకంటే రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతాయి. ఈ రెండింటి మధ్య 5–15 డిగ్రీల వరకు వ్యత్యాసం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వీటి మధ్య వ్యత్యాసం ఇంకాస్త తక్కువగా ఉండే అవకాశమూ ఉంది. అయితే విశాఖలో సోమవారం పగటి ఉష్ణోగ్రత 26.2 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రత 27.4 డిగ్రీలు నమోదయ్యాయి. అంటే పగటి ఉష్ణోగ్రతకంటే రాత్రి ఉష్ణోగ్రత 1.2 డిగ్రీలు అధికంగా రికార్డయ్యాయి. ఫలితంగా పగలుకంటే రాత్రి వేళే వెచ్చదనం అనుభూతి కలిగింది. ఇటీవల కాలంలో ఇలాంటి పరిస్థితి విశాఖలో ఎప్పుడూ లేదని వాతావరణ నిపుణులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకిలా అంటే..?

ద్రోణి ప్రభావంతో సోమవారం ఉదయం నుంచే వర్షం కురవడం మొదలైంది. మధ్యాహ్నం వరకు ఎండ ఛాయలే లేకుండా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. దీనికి తోడు గాలిలో తేమ కూడా అధికంగానే (90 శాతం) ఉంది. అదే సమయంలో ఆగ్నేయ, నైరుతి గాలులకు బదులు కాసేపు ఈశాన్య గాలులు కూడా వీచాయి. ఫలితంగా రాత్రి ఉష్ణోగ్రతలకంటే పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవడానికి దోహదపడిందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం మాజీ అధిపతి ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ 'సాక్షి'కి చెప్పారు. ఇలాంటి వాతావరణం అత్యంత అరుదుగా ఏర్పడుతుందన్నారు. ఎండ కాసి ఉష్ణోగ్రతలు పెరిగే సమయంలో వర్షం కొనసాగడం వల్ల కనిష్టంకంటే గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుదల కనిపించిందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద తెలిపారు.

మే డే నాడు ఏటా వర్షం?!

విశాఖలో సోమవారం ఉదయం వర్షం కురవడంలో మరో ప్రత్యేక ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. గడచిన ఏడు సంవత్సరాలుగా విశాఖపట్నంలో మే డే నాడు క్రమం తప్పకుండా వర్షం కురుస్తోందని చెబుతున్నారు. 2017 నుంచి ఈ ఏడాది వరకు పరిశీలిస్తే ప్రతి మే డేన వాన కురిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇది యాధృచ్ఛికమే అయినా ఈ సంగతిని ఎరిగిన నిపుణులు విశేషంగా చెప్పుకుంటున్నారు. సింహాచలం అప్పన్న చందనోత్సవం నాడు వర్షం కురవడం ఆనవాయితీ అన్నది ఎప్పట్నుంచో ప్రజల్లో నమ్మకంగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తూ చందనోత్సవం రోజున చిరుజల్లులు కురవడం విశేషం!

వర్షంతో పులకింత!

కొద్ది రోజుల క్రితం వరకు ఉమ్మడి విశాఖ జిల్లా ఉష్ణతాపంతో అట్టుడికింది. కానీ ద్రోణి ప్రభావంతో నాలుగు రోజుల నుంచి ఆ పరిస్థితిలో మార్పు వచ్చి వాతావరణం ఒకింత చల్లబడింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షపాతం (6 సెం.మీలకు పైగా) నమోదైంది. ఫలితంగా వానలు, చల్లదనం కోసం పరితపిస్తున్న జనానికి పెద్ద ఉపశమనం కలిగినట్టయింది. కాగా వర్షానికి ఈదురుగాలులు కూడా తోడవడంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మంగళ, బుధవారాల్లోనూ ఉమ్మడి విశాఖ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో పిడుగులు పడే ప్రమాదం ఉందని సూచించింది.



కృష్ణాకాలేజీ రోడ్డులో వర్షం



గొడుగులు వేసుకుని వస్తున్న పాదచారులు

‘జగనన్నకు చెబుదాం’కు సన్నద్ధమవ్వాలి

- పెండింగ్ అర్జీలపై దృష్టిసారించండి
- అధికారులతో కలెక్టర్ మల్లికార్జున
- స్పందనలో 49 వినతుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ కేఎస్ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం : ఈనెల 9 వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమం వివరాల్ని అధికారులంతా ముందుగానే తెలుసుకొని సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డా.మల్లికార్జున సూచించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను మరింత నాణ్యతగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో అధికారులందరూ అత్యంత ప్రాధాన్యత కల్పించి అర్జీలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రజల నుంచి వచ్చే స్పందన వినతుల్ని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల్ని సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల్ని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు.

రెవెన్యూ విభాగానికి సంబంధించి 12 అర్జీలు రాగా, జీవీఎంసీ 21, పోలీస్ 5, ఇతర విభాగాలకు సంబంధించి 11 ఫిర్యాదులు కలిసి మొత్తం 49 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, పోలీస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు మూడు రోజుల్లో పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 28 వినతులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు 3 రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందనలో జోన్-2 నుంచి ఐదు, జోన్-3 నుంచి మూడు, జోన్-4 నుంచి రెండు, జోన్-5 నుంచి ఆరు, జోన్-6 నుంచి ఐదు, జోన్-8 నుంచి 4, ప్రధాన కార్యాలయానికి సంబంధించి 3 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఎఫ్ఏ అండ్ ఏఓ మల్లికాంబ, చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్‌కుమార్, సెక్రటరీ పి నల్లనయ్య, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు, పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్ రవి, వినయ్‌కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, డీపీఓ చంద్రిక, డీఇవో శ్రీనివాసరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపావరం, డీసీపీలు, ఏసీపీలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 38 వినతులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి : స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 38 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్నతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 16 ఫోన్ కాల్స్

ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 16 ఫోన్ కాల్స్ వచ్చాయి. సోమవారం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌ను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వాటిపై వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. డయల్ యువర్ సీపీకి 0891-2523408 నెంబర్ కాల్ చేయడంతో పాటు 9493336633 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సీపీకి ఫొటోలు, వీడియోలతో కూడిన ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించారు. అలాగే ప్రతి సోమవారం జరిగే స్పందన ద్వారా కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు చేయవచ్చని సీపీ తెలిపారు.

సవాళ్లను స్వీకరిస్తేనే.. ఉన్నత స్థాయికి..

- మీ ఆశలు, ఆకాంక్షల సాధాలకు పునాదులు తల్లిదండ్రులే..
- ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు 1,597 ఉద్యోగాలు
- నియామక పత్రాలు అందించిన వీసీ ప్రసాద రెడ్డి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



తల్లిదండ్రుల పాదాలకు నమస్కరిస్తున్న ఈశ్వరీ ప్రియ

ఏయూక్యాంపస్ : సవాళ్లను స్వీకరించిన వారే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షల సాధాలకు పునాదులు తల్లిదండ్రులేనని.. వారి అభ్యున్నతి కోసం తల్లిదండ్రులు చేసిన త్యాగాలను, కష్టాన్ని మరువరాదన్నారు. సోమవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎచీవర్స్ డేని ఘనంగా నిర్వహించారు. 1597 ఉద్యోగాలు సాధించిన 1001 విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు సన్మానం చేసి, పాదాలకు నమస్కరించి, ఆశీస్సులు తీసుకునే విధంగా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను వీసీ స్వయంగా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరానికి మనం అందించే నిజమైన ఆస్తి విద్య అని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇదే వేదికపై నుంచి చెప్పిన మాటలు మరువలేమన్నారు. వర్సిటీలో చదివిన ప్రతీ విద్యార్థి ఉద్యోగం పొందడంతోపాటు మరో పది మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరే విధంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో మౌలిక వసతులను కల్పించామన్నారు. విశ్వవిద్యాలయంలో మైదానాలను తీర్చిదిద్దిన విధానం, వర్సిటీ స్వయం సంవృద్ధి సాధించే దిశగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను వివరించారు. ఈ బ్యాచ్ విద్యార్థులు కోవిడ్ పరిస్థితులను, ఆన్‌లైన్ బోధన, ఆఫ్‌లైన్ పరీక్షలు వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నేడు విజయవంతంగా వెళుతున్నారని, వీరికి సహకారం అందించిన తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థి దశ నుంచి ఉద్యోగిగా మారే ప్రయాణంలో ఎన్నో సవాళ్లు వస్తాయని.. వాటిని స్వీకరించడం, సాధించి చూపడం అలవాటు చేసుకోవాలన్నారు. నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకోవాలని సూచించారు.



తండ్రి, తాతలకు నమస్కరిస్తున్న విద్యార్థిని

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ విలువల వ్యవస్థకు వారసులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ విద్యార్థులు వినయ సంపన్నులుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె భట్టి మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలో తొలిసారిగా ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ తొలి ఉద్యోగం జీవితాంతం గుర్తుండిపోతుందన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ విభాగం డైరెక్టర్ జి.వి.ఆర్ మూర్తి, విభాగాధిపతులు, ఆచార్యులు, పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాలుగు సంస్థల్లో ఉద్యోగాలు



సాఫ్ట్‌వేర్, కోర్ సంస్థల్లో నాలుగు ఉద్యోగాలు ఏక కాలంలో లభించాయి. కరికులంలో సాఫ్ట్‌వేర్ కోర్సులను భాగం చేయడంతో ఉద్యోగాల సాధన సులభమైంది. కళాశాలలో వాతావరణం, ప్లేస్‌మెంట్ కార్యాలయం ప్రత్యేక చొరవతో ఈ సంవత్సరం మంచి ఆఫర్స్ లభించాయి.

– ఎస్.కిరణ్మయి, ఈసీఈ విభాగం

కోర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది



జేఎస్‌డబ్ల్యూ సంస్థలో ఉద్యోగం సాధించాను. కాలేజీలో ముందుగానే ప్లేస్‌మెంట్స్‌పై కొంత అవగాహన కల్పించారు. దీంతో ఇంటర్వ్యూ సులభంగా చేశాను. కోర్ కంపెనీలో ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది.

–ఎస్.మౌనిక, మెకానికల్ విభాగం

అంతా సంతోషంగా ఉన్నాం..



కెమికల్ ఇంజనీరింగ్‌లో అవకాశాలు తక్కువగా ఉన్నాయి. కోర్ కంపెనీల్లో ఉద్యోగం రావడం చాలా కష్టమైన అంశం. ప్లేస్‌మెంట్ అధికారులు, ఏయూ వీసీ ప్రత్యేక చొరవ తీసుకుని పెద్దసంఖ్యలో సంస్థలను ఆహ్వానించారు. మంచి వేతనంలో ఉద్యోగం రావడంతో అందరం సంతోషంగా ఉన్నాం.

–ఎం.కీర్తన, కెమికల్ ఇంజనీరింగ్, ఆఈట్ విద్యార్థిని

ఇంటర్న్‌షిప్‌లు ఉపయుక్తంగా నిలిచాయి



మొదటి సంవత్సరం నుంచి సిలబస్ ఎంతో దూరదృష్టితో తీర్చిదిద్దారు. ఉద్యోగానికి అవసరమైన సాఫ్ట్‌వేర్, లైబ్రరీలో డిజిటల్ సదుపాయాలు.. మాకు కోడింగ్‌పై ఆసక్తిని పెంచాయి. అదే విధంగా కోర్సులో భాగంగా అందించిన ఇంటర్న్‌షిప్‌లు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి.

–ఆర్.ఈశ్వరీ ప్రియ, సీఎస్ఈ విభాగం

ఏఎస్ఐకి సీపీ సన్మానం



ఏఎస్ఐ శివరామచంద్రరావును సత్కరిస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ ఆర్.శివరామ చంద్రరావును నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ సోమవారం తన చాంబర్‌లో సత్కరించారు. 1984లో స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన శివరామ చంద్రరావు 2012లో హెడ్‌కానిస్టేబుల్‌గా, 2020లో ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. అలాగే ఆ విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు రివార్డులను సైతం సొంతం చేసుకున్నారు. పోలీస్ శాఖలో 38 ఏళ్ల సుదీర్ఘ కాలం సర్వీస్ అందించడం గొప్ప విషయమని సీపీ పేర్కొన్నారు శివరామచంద్రరావు కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఆయనకు సత్కరించి వీడ్కోలు పలికారు.

కరోనా కేసు నమోదు

మహారాణిపేట: విశాఖలో సోమవారం కరోనా కేసు ఒకటి నమోదయ్యింది. గడిచిన 24 గంటల్లో 25మందికి పరీక్షలు నిర్వహించగా ఒకరికి కరోనాగా నిర్ధారణ అయింది.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	430.00
విజయనగరం	434.00
శ్రీకాకుళం	434.00

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,760
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,700
వెండి(కిలో):	రూ.80,200

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
స్కిన్	: రూ.220
స్కిన్‌లెస్	: రూ.230

ముగిసిన టెన్నిస్ టోర్నమెంట్



విజేతలతో రత్నాకర్, ఏటీపీ, జార్జి క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జార్జి క్లబ్‌లో అనకాపల్లి జిల్లా టెన్నిస్ అసోసియేషన్(ఏటీపీ) ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రముఖంగా గుర్తింపు పొందిన ఏటీపీ ఈ టోర్నమెంట్‌ను ఈ స్థాయిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో విజయనగరానికి చెందిన జోడీ టి.రామారావు, ఎం.వి.రాజు ప్రథమస్థానంలో నిలిచారు. విశాఖకు చెందిన జోడీ రవిశంకర్, తిలక్‌లు ద్వితీయస్థానం దక్కించుకున్నారు. విజేతలకు రత్నాకర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్లు దాడి ఈశ్వరరావు, గంటి రవికుమార్, కె.ఎస్.గాంధీ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కాశీవిశ్వేశ్వరరావు, ఎం.చంద్రశేఖరరావు, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, క్లబ్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

15 క్రీడాంశాలలో..

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు విశాఖ జిల్లాలోనూ పలు సెంటర్లలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు సోమవారం ప్రారంభించారు. పాండురంగాపురం వీడీఎస్ఏ ఇండోర్ హాల్‌లో జరిగిన శిబిరాల ప్రారంభాన్ని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రారంభించారు. నెల రోజుల పాటు 15 క్రీడాంశాల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. వీడీఎస్ఏ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉష, ఏఎంసీ సహాయ ఆచార్యుడు మనోజ్‌కుమార్, డీఎస్ఏ సీఈఓ సిహెచ్ సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ల ప్రారంభం



సమ్మర్‌క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోర్ట్ స్టేడియంలో సోమవారం అతి పెద్ద సమ్మర్ క్యాంప్ అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలో ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీల సహకారంతో ఒకేసారి 30కి పైగా క్రీడ, విద్య, వినోదానికి సంబంధించిన అంశాలపై నిర్వహిస్తున్న ఈ వేసవి శిబిరంలో పెద్ద సంఖ్యలో పిల్లలు, యువత చేరారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, చెస్, కరాటే, రైఫిల్ షూటింగ్, టైక్వాండో (బాయ్స్ అండ్ గరల్స్), కర్రసాము, ఫెన్సింగ్ ఇలా అనేక క్రీడల్లో ఆరు వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ స్థాయి కోచ్‌లతో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల్లో వేసవి శిక్షణ అందిస్తున్నారు. ఈ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడల పట్ల మక్కువ పెంచడంతో పాటు, క్రీడా నైపుణ్యాన్ని మరింత పదునుపెట్టుకోడానికి ఈ శిక్షణా శిబిరం దోహదపడుతుందని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఎండీ ప్రమోద్ తెలిపారు. క్రీడలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలపై కూడా శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఒక్కొక్కరు ఒక్కో పూల్‌లో రెండు అంశాలను ఎంచుకొనే అవకాశముందన్నారు.

ఈకార్వో ఆధ్వర్యంలో..



సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ఆధ్వర్యంలో చిన్నారుల కోసం ప్రత్యేక వేసవి శిక్షణా శిబిరాన్ని దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం వెనుక గల అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో సోమవారం ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల పిల్లలతో పాటు ఎవరైనా సరే శిక్షణ పొందవచ్చు. జూన్ 3వ తేదీ వరకు చిన్నారులకు వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కీబోర్డు, చెస్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, కరాటే, ఇంగ్లిష్ నైపుణ్యం వంటి అంశాలలో కోచింగ్ ఇవ్వనున్నారు. ఏడేళ్ల నుంచి 18ఏళ్ల లోపు వారు ఎవరైనా ఈ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. ఈ క్యాంప్‌లో ప్రత్యేకంగా డాక్టర్ భాషిణి చిన్నారుల బాల్యంలో వివిధ బోధనేతర అంశాలు ఎలా ప్రభావితం చేస్తాయో, వారి వ్యక్తిత్వ వికాసానికి ఎలా దోహదపడతాయో వివరించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయనున్నారు. వివరాలకు 0891-2882309 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. సోమవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, ప్రత్యేక అతిథి డాక్టర్ భాషిణి పాల్గొన్నారు.